మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరించాలి

కలెక్టర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 1, (నమస్తే తెలంగాణ): ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పక్కాగా వివరాలు సేకరించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీలో కలెక్టర్లతో మాట్లాడారు. ఈ నెల 3 తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం ఫైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గంలో ఒక మున్సిపల్ గ్రామంలో వివరాలు సేకరించాలన్నారు. ఈ నెల 8వ తేదీ కల్లా సర్వే పూర్తి చేసి, 9న స్క్రూట్నీ చేసి 10వ తేదీన రిపోర్ట్ అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎస్‌వో రుక్మిణి, డీఎం త్రినాథ్‌బాబు, డీపీవో చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వృద్ధుల సలహాలు పరిగణనలోకి తీసుకుంటాం

కలెక్టర్ జితేష్ విపాటిల్

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు, వయో వృద్ధులు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 1.(నమస్తేతెలంగాణ) : భావితరాలకు వృద్ధులు ఆదర్శం కావాలని, వృద్ధుల సలహాలు పరిగణలోకి తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీవోసీలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు కుటుంబ సమస్యలను పక్కనపెట్టి సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. అనంతరం వయోవృద్ధుల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. యార్లగడ్డ వెంకటేశ్వరరావు, శాగంటి కృష్ణమూర్తి, రావి వెంకటయ్య, లక్ష్మిప్రసన్న, విజయకుమారి, నాగేశ్వరరావు, కృష్ణయ్య, ఎన్ రెడ్డి, సందీప్, భూషన్‌రావు, భాస్కర్‌రావు, వెస్లీ, యూసూఫ్, జయరామ్, శివప్రసాద్, నాగేశ్వరరావు, రాములు, వరప్రసాద్, నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరసాని వజ్రోత్సవ వేడుకలు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 1: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కిన్నెరసాని (డీర్ పార్కు) వజ్రోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) భీమా నాయక్ పాల్గొని వజ్రోత్సవ వేడుక పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్ మాట్లాడుతూ.. పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలని, అటవీ జంతువుల సంరక్షణ గురించి మరింత ప్రచారం చేయాలని, గేటు నుంచి డ్యామ్ వద్దకు వెళ్ళేందుకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఎఫ్‌డీవో (యానంబైలు రేంజ్) బాబు సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరసాని వజ్రోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

పోస్టింగ్‌లు లేని పదోన్నతులు!

- ఐసీడీఎస్‌లో ఆర్డర్లు వచ్చినట్లే వచ్చి మళ్లీ వెనక్కి
- పైరవీలకే ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- బూర్గంపాడు సీడీపీవోగా నాలుగు రోజుల్లో ఇద్దరికి ఆర్డర్లు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో రచ్చకెక్కుతున్న పైరవీల వ్యవహారం

గత నెల 26న బూర్గంపాడు సీడీపీవోగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ జ్యోతి సీడీపీవోకు డిప్యూటేషన్ ఆర్డర్ ఉత్తర్వులు

ఈ నెల 1న బూర్గంపాడు సీడీపీవోగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ అక్కడ ఏసీడీపీవోగా ఉన్న రేవతికి ఎఫ్ఏసీ ఆర్డర్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో సీడీపీవోల పదోన్నతులు, పోస్టింగ్‌ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. పక్క జిల్లాకు చెందిన ఓ మంత్రి పైరవీ, ఉన్నతాధికారుల తిరస్కారాలతో వచ్చిన ఆర్డర్లు మళ్లీ వెనక్కి వెళ్లడంతో ఆ శాఖలో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి. దీంతో ఉన్నతాధికారులు మరోసారి కౌన్సిలింగ్ నిర్వహించగా.. పదోన్నతి పొందిన వారంతా ఇప్పటివరకు విధుల్లో చేరని పరిస్థితి నెలకొంది. భద్రాద్రి జిల్లా డీడబ్ల్యూవో పోస్టు కోసం పదోన్నతి పొందిన ఇద్దరు సీడీపీవోలు పైరవీ చేయడంతో ఆ పోస్టు కీలకంగా మారింది. ఇందులో ఒకరిని కేటాయిస్తారనే స్పష్టత ఉన్నా.. మరొకరిని సర్దుబాటు ఎలా చేయాలని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో పదోన్నతుల ఫైల్ కార్యాలయానికే పరిమితమైంది.

నాలుగు రోజుల్లో ఇద్దరికి ఆర్డర్లు

జిల్లా అధికారుల పదోన్నతుల వ్యవహారం ఇలా ఉంటే.. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు సీడీపీవో ఎఫ్ఏసీ(పూర్తి అదనపు బాధ్యతలు) వ్యవహారం తలనొప్పిగా మారింది. గత నెల 13న బూర్గంపాడు సీడీపీవోగా ఉన్న ప్రమీలకు డీడబ్ల్యూవోగా పదోన్నతి వచ్చిన సంగతి తెలిసిందే. ఏసీడీపీవోగా ఉన్న రేవతికి అక్కడే పూర్తి అదనపు బాధ్యతలు ఇవ్వాల్సి ఉంది. కానీ.. గత నెల 26 వరకు ఎలాంటి ఆర్డర్ ఇవ్వకుండా డిప్యూటేషన్ పేరుతో సిరిసిల్లలో పనిచేస్తున్న మరో సీడీపీవో జ్యోతికి డిప్యూటేషన్‌తోపాటు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. డిప్యూటేషన్లు లేవని చెప్పిన ఉన్నతాధికారులు అశ్వారావుపేటకు ఒక ఏసీడీపీవోను, బూర్గంపాడుకు మరో ఏసీడీపీవోను వేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకాని పరిస్థితి. ఇదిలా ఉండగా.. బూర్గంపాడులో ఏసీడీపీవోగా పనిచేస్తున్న ఏసీడీపీవోను కాదని.. సిరిసిల్ల సీడీపీవోకు అదనపు బాధ్యతలు ఇస్తూ ఆర్డర్ ఇచ్చిన నాలుగు రోజులకు కమిషనరేట్ నుంచి రేవతి సీడీపీవోకు ఎఫ్ఏసీ ఇస్తూ ఆర్డర్ ఇచ్చారు. ఇటువంటి పరిణామ క్రమంలో ఐసీడీఎస్‌కు ఏమైంది అని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

పైరవీలతో పరేషాన్..

ఐసీడీఎస్‌లో పైరవీల వ్యవహారం రచ్చకెక్కుతున్నది. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. పైరవీలకే పెద్దపీట వేస్తున్నట్లు ఐసీడీఎస్‌లో రోజురోజుకూ జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే స్పష్టమవుతున్నది. ఎవరు ఎక్కడ చేరాలనే ఆర్డర్ ఎప్పుడు వస్తుందోనని ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో సైతం ఎల్‌డీసీ స్థాయి ఉద్యోగి నుంచి సీనియర్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, చివరికి సీడీపీవో స్థాయి వరకు డిప్యూటేషన్‌తో మళ్లీ ఎవరి స్థానాలకు వాళ్లు వస్తున్నారంటే పైరవీలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో తెలుస్తున్నది. 'చేతి'లో డబ్బులుంటే ఎంత దూరంలో ఉన్నా సొంత ప్రదేశానికి రావొచ్చనేది ఇలాంటి ఆర్డర్లను చూస్తే తెలిసిపోతుంది. ఇలాంటి ఆర్డర్లు ఎంత మందికి ఇస్తారో వేచి చూడాల్సిందే.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు

లొంగిపోయిన దళ సభ్యుడికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 1: మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఎదుట లొంగిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని కరిగుండెం గ్రామానికి చెందిన మడకం ఇడుమయ్య అలియాస్ మహేష్ 15 ఏళ్ల క్రితం ఆళ్లపల్లి మండలం అడవి రామారం గ్రామనికి వలస వచ్చాడు. మహేష్ గత ఏడాది జనవరి 30వ తేదీన తన సోదరుడైన పూనెం ఇడుమయ్యతో కలిసి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామోదర్ సమక్షంలో దళ సభ్యుడిగా చేరాడు. నాటి నుంచి మావోయిస్టు కార్యకలాపాలతో పాటు, భద్రతా బలగాలపై జరిగిన వివిధ దాడుల్లో పాల్గొన్నాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడైన కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకన్నకు సైతం మహేష్ గార్డుగా పనిచేశాడు. మహేష్ స్వేచ్ఛాయుత జీవితాన్ని గడిపేందుకు జనజీవన స్రవంతిలో కలిశాడని ఎస్పీ పేర్కొన్నారు. లొంగిపోయే మావోయిస్టులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరుపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

గ్రామాలు పచ్చదనంతో వెల్లివిరియాలి

ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ కృష్ణన్

పినపాక, అక్టోబర్ 1 : గ్రామాలన్ని పచ్చదనంతో వెల్లివిరియాలని పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ కృష్ణన్ అన్నారు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు ఎంపికకు నామినేటైన భూపాలపట్నం పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మొక్కలను, శానిటేషన్ పనులను పరిశీలించారు. ఇంకుడుగుంతలను పరిశీలించి గ్రామస్తులను అభినందించారు. గ్రామస్తులు సంప్రదాయ నృత్యాలు, డోలు వాయిద్యాలతో అడిషనల్ కమిషనర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఎల్పీవో సుధీర్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రకుమార్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినులకు ఎంబీబీఎస్ సీట్లు

భద్రాచలం, అక్టోబర్ 1 : భద్రాచలంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించిన ఐదుగురు గిరిజన విద్యార్థినులకు నీట్ తొలి దశ కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లు లభించాయి. బి.వీరకుమారికి మహబూబ్‌నగర్, కె.చైతన్యకు గద్వాల్, పి.గీతాంజలికి గద్వాల్, కె.సాత్వికకు హైదరాబాద్, ఇ. అమృతరాణికి హైదరాబాద్‌లో సీట్లు లభించాయి. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి మంగళవారం అభినందించారు.

సాయిరాంతండాలో విషాదం

చికిత్స పొందుతూ దంపతులు మృతి

రత్నకుమార్ –పార్వతి దంపతుల (ఫైల్)

జూలూరుపాడు/చుంచుపల్లి, అక్టోబర్ 1: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోయామని గ్రహించి మనస్థాపానికి గురైన దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన దంపతులు హైదరాబాద్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన హళావత్ రత్నకుమార్(30), పార్వతి(25) దంపతులు రెండేళ్ల క్రితం కొత్తగూడెంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తూ చుంచుపల్లిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రత్నకుమార్ పనిచేస్తున్న షాపులో ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన వ్యక్తి సింగరేణి సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తున్నాడని, చాలా మందికి ఉద్యోగాలు వచ్చాయని నమ్మబలకడంతో అతడి మాటలు విని రూ.16లక్షలు అప్పుచేసి అతడికి ఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత ఉద్యోగం రాలేదని, తిరిగి డబ్బులు ఇవ్వాలని అడగ్గా అతడు మొఖం చాటేశాడు. మోసపోయానని గ్రహించిన రత్నకుమార్ దంపతులు మనస్తాపంతో సోమవారం పురుగుమందు తాగారు. వారిని హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. మృతదేహాలను స్వగ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దంపతుల మరణానికి కారకులైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు.

సాగర్ కాల్వలో ముగ్గురు యువకులు గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం, మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతైన ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్‌లు సోమవారం ఖమ్మం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న తన మిత్రుడిని చూసేందుకు ఆటోలో ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం మిత్రుడిని జైలులో కలిసిన తర్వాత నలుగురు యువకులు కలిసి దానవాయిగూడెంలో నివాసం ఉంటున్న చల్లా రమేశ్ అన్న కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించిన అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకోగా.. రోండ వెంకటేశ్వర్లు అందుకు నిరాకరించి ఆటోలోనే పడుకున్నాడు. ఈ క్రమంలో మిగిలిన ముగ్గురు మెట్ల మార్గం ద్వారా సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ముగ్గురు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల బట్టలు కాల్వ గట్టుపై కనిపించడంతో ఆందోళన చెందిన వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాగర్‌లో కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. అన్నం ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు బృందం సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు యువకులు చల్లా రమేశ్, ప్రసాద్‌ల కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.